నేటితో ముగియనున్న క్రీడాకారుల రిజిస్ట్రేషన్ గడువు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వికలాంగుల క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ శుక్రవారంతో ముగుస్తుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) వికలాంగుల కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్.రామన్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎసిఎ, వికలాంగుల క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాకారుల ఎంపిక కోసం చేపడుతున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 21న వికలాంగుల క్రికెట్ క్రీడాకారుల ఎంపిక తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8688146164, 7780167625 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బంకుల్లో తనిఖీలేవి..?

- పెట్రోల్ బంకుల్లో కానరాని భద్రతా చర్యలు
- కొరవడిన కనీస సౌకర్యాలు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు
- టెక్కలి పెట్రోల్ బంకు అగ్ని ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణం



జిల్లాలో పెట్రోల్ బంకుల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. కేవలం వ్యాపార దృక్పథం తప్ప వినియోగదారుల భద్రతను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. బంకుల వద్ద వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై యజమానులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా చిన్న నిప్పురవ్వ తగిలితే మండే స్వభావం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వ చేసే ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోట చేసుకోకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై నిర్వాహకుల నిర్లక్ష్య వైఖరి ప్రమాదాలకు తావిస్తోంది. టెక్కలి పాత జాతీయ రహదారి పెట్రోల్ బంకులో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదం, పెట్రోల్ బంకుల్లో భద్రత డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 128 పెట్రోల్ బంకులు ఉన్నాయి. హెచ్‌పిసిఎల్ కంపెనీ ఆధ్వర్యాన 36 పంపులు, ఐఒసిఎల్ 44 పంపులు నడుస్తున్నాయి. ఎస్సార్ కంపెనీకి చెందిన పంపులు పది, నయార కంపెనీ ఆధ్వర్యాన ఎనిమిది, రిలయన్స్ కంపెనీకి చెందినవి రెండు పంపులు ఉన్నాయి. వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా కంపెనీలు కొన్ని మార్గదర్శకాలు, నిబంధలను రూపొందించుకున్నాయి. వాటిని అమలు చేసే విషయంలో మాత్రం డీలర్లు, బంకు యజమానులు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బంకుల్లో కొరవడిన కనీస సౌకర్యాలు

ముఖ్యంగా పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాలకు ఉచితంగా గాలి అందించాలి. జిల్లాలో ఒకట్రెండు పెట్రోల్ బంకులు మినహా ఏవీ ఆ రకమైన సౌకర్యాన్ని అందించిన పరిస్థితి లేదు. అత్యధిక బంకుల్లో గాలి కొట్టే యంత్రాలూ లేని పరిస్థితి నెలకొంది. వెలుతురు, మంచి పరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. చాలా బంకుల్లో ఇవి కానరావడం లేదు. కొన్ని బంకుల్లో ఉన్నా వాటికి తాళాలు వేసి ఉంటున్నాయి. కచ్చితమైన పరిమాణం, నాణ్యత కలిగిన పెట్రోల్ అందించాలి. పంపు మీటరును సున్నాకు అమర్చి వినియోగదారులకు చూపించాలి. ఇది ఒక్కటి మాత్రం దాదాపు అన్నిచోట్లా అమలవుతోంది.

అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి

పెట్రోల్, డీజిల్ వెంటనే మండే స్వభావం గల ఇంధనాలు కావడంతో, బంకుల వద్ద కచ్చితమైన భద్రతా చర్యలు చేపట్టాలి. బంకుల వద్ద ఫైర్ అలారం ఏర్పాటు చేయాలి. బంకులో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఇది అప్రమత్తం చేస్తుంది. మంటలను ఆర్పే పరికరాలు, బకెట్లతో ఇసుక అందుబాటులో ఉంచాలి. పనిచేసే సిబ్బందికి ఫైర్ సేఫ్టీ అంశంపై శిక్షణ ఇవ్వాలి. సిబ్బందికి ఆ రకమైన శిక్షణ లేకే టెక్కలిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక పరికరం సరిగా వినియోగించడం రాక భయంతో పరుగులు తీశారు. పెట్రోల్ బంకుల్లో ప్రతిరోజూ ఫైర్ సేఫ్టీ చెక్ లిస్ట్‌ను పరిశీలించాలి.

తప్పిన పెను ముప్పు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్



పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. బంకులో పాత పరికరాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త పరికరాన్ని అమర్చే క్రమంలో వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుందని కొందరు చెప్తున్నారు. పరికరాలు అమర్చే క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల చోటుచేసుకుందని మరికొందరు చెప్తున్నారు. ప్రమాదం సంభవించిన వెంటనే మంటలు చెలరేగడంతో వాహనదారులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఒకానొక దశలో పెట్రోల్ నిల్వ ఉన్న ట్యాంకులకు మంటలు వ్యాపించి పేలుళ్ల సంభవిస్తాయేమోనన్న ఆందోళనతో భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదాన్ని నియంత్రించేందుకు వినియోగించే పరికరాలు బంకులో అందుబాటులో ఉన్నాయా?, లేవా?.. వాటిని సిబ్బంది వినియోగించారా? లేదా? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించడం లేదు. ప్రమాదం సంభవించిన వెంటనే దట్టంగా నల్లటి పొగ ప్రాంతాన్ని కమ్మివేయడంతో స్థానికులకు ఏం జరుగుతుందో తెలియరాలేదు. స్థానికులు టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బంకులో పెట్రోలుతో నిల్వ ఉన్న ట్యాంకులకు సంబంధించిన పరికరాలను ముందస్తుగా మూసివేయడం వల్ల పెను ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, సిఐ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్న అనంతరం బంకులో రికార్డులను పరిశీలించారు.

కొరవడిన తనిఖీలు

పెట్రోల్ బంకుల్లో భద్రతా చర్యలు, వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలు లేకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతుండడంతో బంకు యజమానుల ఇష్టారాజ్యంగా మారింది. పెట్రోల్, డీజిల్ వంటి ప్రమాదకర ఇంధనాలను నిల్వ చేస్తున్న చోట భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు యజమానులు తప్పనిసరిగా నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఒసి) తీసుకోవాలి. ఏ బంకు యజమానీ ఎన్‌ఒసి తీసుకున్న దాఖలాలు లేవు. బంకు ఏర్పాటైనప్పుడు ఇచ్చిన ఎన్‌ఒసిలతోనే అంతా నెట్టుకొస్తున్నారు.

ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం



పెట్రోల్ బంకుల నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. లోపాలను గుర్తించి వారికి చెప్తున్నాం. ఫైర్ సేఫ్టీ నిబంధనల అంశం అగ్నిమాపకశాఖ చూస్తుంది.

- జి.సూర్యప్రకాష్
జిల్లా పౌర సరఫరాల అధికారి

ఎన్ఒసిలు రెన్యువల్ చేసుకోవడం లేదు



పెట్రోల్, డీజిల్ అమ్మకాలు సాగించే బంకుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అందుకు అవసరమైన పరికరాలును ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి బంకు యజమాని తప్పనిసరిగా ఎన్ఒసి తీసుకోవాలి. బంకు ఏర్పాటు చేసినప్పుడు ఇచ్చిన ఎన్ఒసిలు తప్ప ఎవరూ రెన్యూవల్ చేసుకోవడం లేదు

- జె.మోహనరావు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి



శ్రీకాకుళం అర్బన్ : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న ప్రజాసంఘాల నాయకులు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

అంబేద్కర్‌పై వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యాన గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసును నమోదు చేయాలన్నారు. జాతీయ ఎస్‌సి కమిషన్ జోక్యం చేసుకోవాలని, ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి పెట్టాలనే ఉద్దేశంలో భాగంగానే పార్లమెంట్ వేదికగా అమిత్ షా వ్యాఖ్యలు బయటపడ్డాయని విమర్శించారు. అంబేద్కర్‌ను అనడం ఫ్యాషన్‌గా మారిందని, వాళ్లు అన్నిసార్లు అనడం కంటే దేవుడు పేరు స్మరిస్తే స్వర్గంలో స్థానం దక్కుతుందని అమిత్ షా వ్యాఖ్యానించడం బిజెపి అసలు రంగు బయటపడిందన్నారు. బిజెపి ఫాసిస్టు, నియంతృత్వ విధానానికి నిదర్శనమన్నారు. ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నది అంబేద్కర్ వల్లే అనే వాస్తవాన్ని మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షులు కె.అప్పారావు ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరీష్, డి.చందు, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు, నగర పౌర సంక్షేమ వేదిక కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బగాది వాసుదేవరావు, సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, కెవిపిఎస్ నాయకులు బి.ప్రభాకర్, డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి ఎల్లయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు, టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు మట్ట పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల కేంద్రంలో ప్రజాసంఘాలు, దళిత మహాసభ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, దళిత మహాసభ నాయకులు డి.అప్పన్న, డి.జమ్మయ్య టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన...

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని అరసవల్లి మిల్లు కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని మునగవలసలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొత్స వెంకటరమణ, నాయకులు జి.దాలయ్య తదితరులు పాల్గొన్నారు.


నేడు వికలాంగుల గ్రీవెన్స్

శ్రీకాకుళం : ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్న వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) వినతుల స్వీకరణ కార్యక్రమం ఈనెల 20వ తేదీన ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


రాష్ట్ర పండగగా రథసప్తమి ఉత్సవం

జిఒ విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
REVENUE (ENDOWMENTS-II) DEPARTMENT
ORDER:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించింది. ఈమేరకు గురువారం జిఒ నంబరు 291 ప్రభుత్వం జారీ చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఆ రోజు స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నాలుగో తేదీన రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండగగా గుర్తిస్తూ, మూడు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం జిఒ విడుదల చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి అరసవల్లి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా నిర్వహించాలని చేస్తున్న ప్రయత్నం ఫలించిందని పేర్కొన్నారు. ఇప్పటికే అరసవల్లి ఆలయ అభివృద్ధికి ప్రసాదం పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.వంద కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిపిఒ భారతీ సౌజన్య

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య తెలిపారు. మండలంలోని దూసి, కలివరంలోని చెత్త సంపద కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తలను వేరు చేసి వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయాలన్నారు. వీటిని విక్రయించి పంచాయతీ ఆర్థిక వనరులను పెంపొందించాలని సూచించారు. అనంతరం దూసి, కొర్లకోట గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. ఇంటి పన్ను వసూలుకు స్వర్ణ పంచాయతీ పని విధానాన్ని పరిశీలించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి అన్ని పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి అన్నెపు గోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, ప్రసన్న, శ్రీనివాస్ సాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు

- మత్స్యకారులకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

తీర ప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాస్థాయి తీర ప్రాంత భద్రతా కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తొలుత సమీక్షించారు. కోస్టల్ పోలింగ్ కేంద్రాల ప్రహరీలకు సంబంధించిన పనుల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సముద్రతీర ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించే ప్రదేశాల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తున్నా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఇందుకోసం గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వాచ్ టవర్ల ఏర్పాట్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తీర ప్రాంతాల్లో హోర్డింగ్‌లు... బారువ, కళింగపట్నం ప్రాంతాల్లో లైఫ్ జాకెట్లు, బోట్లు అవసరమని సభ్యులు కోరగా, తదుపరి చర్యలు నిమిత్తం సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీ చేసే బయోమెట్రిక్, ఆధార్ కార్డులు తీసుకెళ్లడం లేదని, దీనిపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సముద్ర తీరంలో జెట్టీలను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా, సంబంధిత పనులపై చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ ఉప సంచాలకులను కలెక్టర్ ఆదేశించారు. తీర ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం లేదని సభ్యులు కోరగా, అందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో కోస్టల్ గార్డు ఎస్‌పి రవివర్మ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.రాము, మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.వి శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు టి.సంతోష్ కుమార్, తీర ప్రాంత సిఐలు, ఎస్ఐలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి విజయానికి తొలి మెట్టు

ముగిసిన జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

క్రీడల్లో ఓటమి విజయానికి తొలి మెట్టు అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ గురువారంతో ముగిశాయి. పోలీస్ క్రీడాకారులు ముగింపు మార్చ్‌ఫాస్ట్ చేసి కలెక్టర్, ఎస్‌పికి గౌరవ వందనం సమర్పించిన అనంతరం స్పోర్ట్స్‌మీట్ క్రీడా ప్రతీకగా సూచించే పోలీస్ క్రీడా పతాకాన్ని కలెక్టర్‌కు అందించారు. పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్మ్‌డ్ పోలీస్ రిజర్వు జట్టు నిలిచింది. వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మొదటి స్థానం, బ్యాడ్మింటన్ లో క్లూస్ టీమ్ ఎస్ఐ భరత్ కుమార్, ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ, ప్రథమ స్థానం సాధించారు. క్రికెట్‌లో కాశీబుగ్గ సబ్ డివిజన్ జట్టు, టగ్ ఆఫ్ వార్‌లో హోంగార్డు విభాగం విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన జట్లకు, పోలీసు సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులకు కలెక్టర్, ఎస్‌పి చేతుల మీదుగా ట్రోఫీలు, మెడల్స్, మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు మెమోంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు వివేకానంద్, శేషాద్రి, సిఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పిఇటి మాస్టర్లు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్, ఎస్‌పి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కేంద్ర గిరిజనశాఖ మంత్రి జువెల్ రోంను కోరారు. న్యూఢిల్లీలో మంత్రి కార్యాలయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోయిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి ఉందన్నారు. రోడ్డు సదుపాయం లేక ఇప్పటికీ అనేక గిరిజన ప్రాంతాల్లో డోలిపైనే ఆధారపడుతున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. వైద్య సదుపాయాల్లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మెళియాపుట్టి మండలంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని, ఆ మండల కేంద్రంగా చేసుకొని ఐటిడిఎను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వదలని వాన

మరో రెండు రోజులు వర్షాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడో రోజు గురువారం వానలు కురిశాయి. మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు పడ్డాయి. జిల్లాలో సగటున 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గార మండలం కళింగపట్నంలో అత్యధికంగా 14.5 మి.మీ వర్షం కురిసింది. సరుబుజ్జిలి మండలం విజయరాంపురంలో 7.5 మి.మీ వర్షం పడింది. పోలాకిలో ఏడు మి.మీ, నిమ్మాడలో ఆరు మి.మీ, ఎల్ఎన్‌పేట, ఆమదాలవలస, రాగోలు, నరసన్నపేటలో 5.5 మి.మీ చొప్పున వర్షం కురిసింది. ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటలో 5.5 మి.మీ, ఎల్ఎన్‌పేట మండలం కోవిలాంలో నాలుగు మి.మీ వర్షం కురిసింది. శ్రీకాకుళం నగరంలో నాలుగు మి.మీ వర్షం పడింది. వజ్రపుకొత్తూరులో అత్యల్పంగా 0.25 మి.మీ వర్షం కురిసింది. తీవ్ర అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి - కవిటి

అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రజలు కట్టే పన్నుల ద్వారా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు జీతాలు చెల్లిస్తారని, అలాంటి ప్రజలకు మన వల్ల ఉపయోగం లేనప్పుడు పదవులు, ఉద్యోగాలు వ్యర్థమన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలు తీర్చాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అటవీ శాఖ సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని, ప్రభుత్వం తీరప్రాంత రహదారులపై ప్రత్యేక దృష్టిసారించి రోడ్లు మంజూరు చేస్తే, దానికి అటవీశాఖ సిబ్బంది కొర్రీలు వేయడంపై అసహనం వ్యక్తం చేశారు. తీర ప్రాంత గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి సహకరించాలన్నారు. ఆర్అండ్‌బి అధికారులు నియోజకవర్గ వ్యాప్తంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి కె.అప్పలస్వామి, తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్



మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఉత్తీర్ణతా శాతం మెరుగుదలకు దోహదం

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులు బాధ్యతను గుర్తెరిగి వాత్సల్యాన్ని కలిగి ఉండాలని, అప్పుడు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని జాయింట్ కలెక్టర ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యాన ముద్రించిన పదో తరగతి ఇంగ్లీష్ మీడియం మోడల్ పేపర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి మోడల్ టెస్టు పేపర్లు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులకు సరసమైన ధరలకు అందించడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం కొనుక్కోగలరన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన మోడల్ పేపర్లు ముద్రించి సామాజిక బాధ్యతను నెరవేర్చడం శుభపరిణామమన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా పనిచేస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల సంక్షేమాన్ని బాధ్యతగా బావించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, అకడమిక్ కమిటీ కన్వీనర్ ఎల్.వి.చలం, కోదండ రామయ్య పాల్గొన్నారు.

జీవనోపాధులతో ఆదాయ కల్పన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జీవనోపాధుల కల్పనతో ప్రజలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఏరియా కో-ఆర్డినేటర్ రామ్మోహనరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యాన సమీకృత వ్యవసాయ క్లస్టర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమరాల్తాడను సమీకృత వ్యవసాయ క్లస్టర్‌గా గుర్తించి 300 కుటుంబాలకు జీవనోపాధులు కల్పించి కుటుంబానికి నెలకు రూ.పది నుంచి రూ.15 వేలు అదనపు ఆదాయం కలిపించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ జీవనోపాధులు శిక్షణలు, ఆదాయం పెంచేందుకు పథకాలను అందిస్తున్నామన్నారు. కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకొని వారి ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ధనుజయ, ఈశ్వర్, కిరణ్వాణి, కేశవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్మోహనరావు

రెవెన్యూ సదస్సులు రైతులకు వరం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు వరం అని టిడిపి సీనియర్ నాయకులు నాళ్ల ఆదినారాయణ (చిన్ని) అన్నారు. మండలంలోని కురుడు సచివాలయం పరిధిలో పాకివలసలో రెవెన్యూ అధికారులు గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు చెందిన వివిధ రకాలైన భూములు, సమస్యలు పరిష్కరించుకోవడానికి వేదిక రెవెన్యూ సదస్సులేనని అన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిటి సిహెచ్.వి.ఎస్.కె.ప్రసాదరావు, భూ రీ సర్వే డిటి పి.శ్రీనివాస్, సర్వేయర్ పి.వి.ఎస్.ఆర్.మూర్తి, ఆర్ డి.పవిత్ర, నాయకులు బోర అప్పారావు, చింతల సింహాచలం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. మండలంలోని కొఠారిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.ధనలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సహదేవ్ రెడ్డి పాల్గొన్నారు.

లావేరు : భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులని సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని




లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరావు

తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. గురువారం హనుమంతుపురం, సహపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమష్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని, సమస్యలున్న వారు ఫిర్యాదులు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 10 వినతిపత్రాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బళ్లాడ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, విఆర్ఒలు మల్లీశ్వరరావు, అజ్జరాం మాజీ సర్పంచ్ బోర శ్రీనువాసరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందుండాలి



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పంచాయతీల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో గ్రామస్థాయి నుంచి ముందువరసలో ఉండి, తద్వారా జిల్లాన్ని రాష్ట్రంలో ఉత్తమ స్థాయిలో నెలబెట్టాలని ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆకలి బాధలను నివారించి ఆహార భద్రతను కల్పించడం, నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, లింగ అసమానత్వం రూపుమాపడం వంటి లక్ష్యాలు ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఈ లక్ష్యాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా మనం సాధించగలుగుతామన్నారు. ప్రస్తుత కార్యక్రమంలో ఈ లక్ష్య సాధనకు క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లి మరింత సమర్థవంతంగా ప్రభుత్వ విధానాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి జె.అనందరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పంచాయతీల్లో సుపరిపాలనే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, సిబ్బంది పనిచేయాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డిఇ ఎస్.రాజేశ్వరి, ఎపిఒ టి.రవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విమలారాణి పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి- పాతపట్నం

పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని



తరగతులను పరిశీలిస్తున్న బాలాజీ

విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని, డార్మెటరీని, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, కొల్లివలస ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

గణిత ప్రతిభా పరీక్షకు స్పందన

వజ్రపుకొత్తూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన గణితి ప్రతిభా పరీక్షకు స్పందన లభించింది. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జి.లక్ష్మణరావు సమక్షంలో గణిత ఉపాధ్యాయులు చింత ఉమారావు ఆధ్వర్యాన గణిత ప్రతిభా పరీక్షలకు 135 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి లెవెల్ వన్ పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన 25 మందికి రెండో స్థాయి పరీక్ష నిర్వహించారు. వీరిలో మొదటి ఐదు స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులకు గణిత దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు రషీద్, రాజశేఖర్, సత్యరాజు, ధర్మారావు, ఉమామహేశ్వరి, సీతమ్మ, పార్థసారధి, ఉపాధ్యాయులు వల్లభరావు, నాగేశ్వరావు, జయరాం సింహాచలం, తులసీరావు, హరికృష్ణ, ఢిల్లేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నందిగాం : మండలంలోని మదనాపురం సబ్ స్టేషన్ పరిధి ఉన్న మదనాపురం, కల్లాడ, హర్షబడ, దిమ్మిడిజ్వాల, దీనబందిపురం, రాతజన, బొడ్డపాడు, నౌగాం, కైజాల తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎఇ జి.శంకరరావు తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటినెన్స్, జింగిల్ క్లియరెన్స్ కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుదపుల చేస్తున్నామని అన్నారు.

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి- సోంపేట

ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో త్యాగాల ఫలితం ఆత్మార్పణలు దీర్ఘకాల పోరాటంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటు పరం చేయడానికి పూనుకోవడం మంచిది కాదని బిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు అన్నారు. ఈ మేరకు సోంపేట పోస్టాఫీసు వద్ద గురువారం పోస్టు కార్డుల ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ... ప్రభుత్వ రంగంలోనే ఉంచమని కోరుతున్న సందర్భం ఉందన్నారు. ఎన్నికల వాగ్దానాల్లో లక్షలు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష పోస్టు కార్డుల ఉద్యమంలో మన బాధ్యతగా వెయ్యి పోస్టుకార్డులు ఈ ప్రాంతం నుంచి ప్రధానమంత్రి మోడీకి పంపించే కార్యక్రమం



పోస్టుకార్డులను పంపిస్తున్న నాయకులు

తీసుకున్నాని తెలిపారు. విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులతో సంతకాలు చేయించి పోస్టు కార్డులను దశలవారీగా పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజయ దుర్గ మోటర్ యూనియన్ సభ్యుడు పి.రామారావు, బిసి సంఘాల నాయకులు ఎస్.జానకిరావు, ఎం.అజిత్, పి.ప్రభు, కె.లోకేష్, టి.మోహనరావు, టి.అశోక్, మహిళా సంఘ సభ్యులు టి.అరుణ, టి.బాలమ్మ, జె.సీతమ్మ, జేజమ్మ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బూర్జ : మండలంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ప్రత్యేక తనిఖీ అధికారి జి.సత్యవతి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో 100 రోజుల పైబడి ఆన్‌లైన్‌లో అమ్మకాలు చూపించని వారిపై ఆరాతీశారు. అలాగే రికార్డులు పరిశీలించారు. సకాలంలో డిబిటి చేయకపోతే ప్రభుత్వం నుంచి సరఫరా చేసే కంపెనీలకు సబ్సిడీ చెల్లించడంలో జాప్యం జరుగుతున్న ఇబ్బందిని డీలర్లకు తెలియజేశారు. సకాలంలో అమ్మకాలు ఆన్‌లైన్‌లో చూపించకపోతే దుకాణాలకు రావాల్సిన ఎరువుల కేటాయింపులు కూడా తగ్గిపోతాయని తెలిపారు. దాదాపుగా 15 టన్నుల యూరియా, ఎరువులు గత 2 ఏళ్లుగా బూర్జ సొసైటీలో పెండింగ్ ఉన్నట్లు గుర్తించారు. అది సరి చేయని పక్షంలో లైసెన్స్ రద్దుచేసి, లీగల్ నోటీసులు పంపిస్తామని సొసైటీ ముఖ్య నిర్వహణ అధికారిని హెచ్చరించారు. కొల్లివలస, గుతావల్లి రైతుసేవా కేంద్రంలోనూ, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

పలాస : స్థానిక మదర్ థెరీసా పాఠశాలలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తండ్రి సూర్యనారాయణ 20వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం దుస్తులను పంపిణీ చేశారు.



దుస్తులను పంపిణీ చేస్తున్న బాబూరావు, భవాని

కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తుపాను హెచ్చరికలు సందర్భంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మధు అన్నారు. మండలంలోని బెండి, పెద్దబొడ్డపాడులో గురువారం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కోసిన వరి పంటను జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన వారు రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈయనతో పాటు డిటి మురళీకృష్ణ, మండల ఎఒ కిరణ్‌వాణి ఉన్నారు.

పలాస : వాతావరణం పూర్తిగా తేరుకునే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి కోతలు వాయిదా వేసుకోవాలని తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. మండలంలోని అల్లుకోల, లొద్దభద్ర, జగన్నాథపురం, రెంటికోట గ్రామాల్లో గురువారం పంట పొలాలు, వరి కుప్పలను పరిశీలించారు. కోసిన పంటను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

సోంపేట : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిచిన వరి పంట పొలాలను తహశీల్దార్ అప్పలస్వామి, ఎఒ నరసింహమూర్తి పరిశీలించారు. మండలంలోని తలస్వరం, బారువ పరిసర ప్రాంతంలో పర్యటించి రైతులతో మాట్లాడారు.



వజ్రపుకొత్తూరు : రైతులతో మాట్లాడుతున్న మధు



సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎఒ నరసింహమూర్తి

శాస్త్రీయతకు పెద్దపీట

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

భారతీయ తత్వశాస్త్రానికి సరికొత్త నిర్వచనం చెప్పిన మహనీయులు, సామాజిక తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. తన ఆలోచనలు, తాత్విక సిద్ధాంతాలు, రచనలు, ప్రసంగాలతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అత్యంత శక్తిమంతుల్లో ఆచార్య సచ్చిదానందమూర్తి ప్రముఖులని కొనియాడారు. తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీలో జరుగుతున్న 98, 99 భారతీయ తత్వశాస్త్ర కాంగ్రెస్‌లో గురువారం ఆమె పాల్గొని 'ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి' స్మారకోపన్యాసం చేశారు. బోధన, అధ్యయనాల్లో శాస్త్రీయుతకు, లోతైన విశ్లేషణకు ఆచార్య మూర్తి నిరంతరం పెద్దపీట వేశారన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత అంతటి ప్రపంచ రుషి సచ్చిదానందమూర్తి అని అన్నారు. వైస్ ఛాన్సలర్‌గా, యుజిసి వైస్ చైర్మన్‌గా చేసిన ఎనలేని సేవలకు గుర్తుగా పలు విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్లు అందించగా, భారత ప్రభుత్వం 'పద్మవిభూషణ్' అవార్డుతో గౌరవించిందన్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు



మాట్లాడుతున్న విసి రజని

కొనసాగుతున్న ఈ కాంగ్రెస్ సమావేశాలకు ఆచార్య ఎస్.కె.సింగ్ (బీహార్), ఆచార్య ఎస్.పన్నీర్ సెల్వమ్‌లు పర్యవేక్షిస్తుండగా అన్నామలై వర్సిటీ తత్వశాస్త్ర విభాగం నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా పలు వర్సిటీలకు చెందిన తత్వశాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని పలు స్మారకోపన్యాసాలు చేశారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

శ్రీకాకుళం: విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మరణించిన హోంగార్డు కాంతారావు కుటుంబానికి యాక్సిస్ బ్యాంకు అందించే ప్రమాదం భీమా నగదు రూ.34 లక్షల చెక్కును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి చేతులమీదుగా కాంతారావు సతీమణి లక్ష్మి, కుటుంబసభ్యులకు అందించారు. యాక్సిస్‌బ్యాంకు, పోలీసు, హోంగార్డుల నెలవారీ జీతం ఖాతా యాక్సిస్ బ్యాంకులో ఉన్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రమాద భీమా కింద రూ.30 లక్షలు, వారి పిల్లల చదువుల నిమిత్తం పిల్లలు ఒకొక్కరికి రూ.4 లక్షల చొప్పున ప్రమాద భీమా సౌకర్యం కల్పించారు. హోంగార్డు కాంతారావు ఆగస్టు నెలలో ప్రమాదవశాత్తు మరణించడంతో ప్రమాదబీమా నగదు రూ.34 లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడు



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

తూ కాంతారావు మరణించడం బాధాకరమని, ఆయన కుటుంబసభ్యులకు జిల్లా పోలీస్‌శాఖ అండగా ఉంటుందన్నారు. వచ్చిన ప్రమాద బీమా నగదు కుటుంబ అవసరాలు, పిల్లల చదువు నిమిత్తం సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.వి రమణ, కార్యాలయ ఎఒ సిహెచ్ గోపీనాథ్, యాక్సిస్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ రమేష్, డిప్యూటీ మేనేజర్ ఎస్.బాలరాజు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు రచయితల మహాసభకు శరత్‌బాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



శరత్‌బాబు

విజయవాడ కేంద్రంగా ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో వక్తగా నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ రచయిత జంధ్యాల శరత్ బాబుకు ఆహ్వానం అందింది. రామోజీరావు సభావేదికపై 'పత్రికలు, ప్రచురణలు, ప్రసార రంగాల సదస్సు' లో ఆయన ప్రసంగించనున్నారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు రచయితల మహాసభ నిర్వాహక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి. సుబ్బారావు, జి.వి.పూర్ణచందుల నుంచి ఆహ్వానం అందినట్టు జంధ్యాల తెలిపారు.

సాగునీటి పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ పరిధిలోని సాగునీటి కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గ పరిధిలోని సాగునీటి కాలువల్లో గుర్రపు డెక్క, మురుగు కాలువల్లో తూటికాడ తొలగింపు కోసం మొత్తం 20 పనులకు రూ.17.93 లక్షల నిధులను అలాగే నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ అత్యవసర పనులు మరమ్మతుల కోసం 17 పనులకు రూ.58.40 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని, సాగునీటి కాలువల ద్వారా ఆయకట్టు ప్రాంతాల సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. నిధుల విడుదలకు కృషిచేసిన సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం



లావేరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారుల చట్టాలపై ప్రజలకు అవగహన లేక అనేక విధాలుగా నష్ట పోతున్నారని, ప్రతిఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగహన పెంచుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా వినియోగదారు న్యాయపాలన వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై జిల్లాస్థాయి వక్తృత్వపు, వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని ఆరు డిగ్రీకళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్, తెలుగు బాషల్లో ఈ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు జాతీయ వినియోగదారుల దినోత్సవం రోజు పారితోషికంతో పాటు సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ హెచ్ఒడి ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పి. శంకర్ నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్. పద్మావతి, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి.ప్రభాకరరావు, అధ్యాపకులు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ప్రతిఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పాఠశాల వినియోగదారుల క్లబ్ కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా బుడుమూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రజల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన చేపట్టారు. పలు నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎస్.కె ప్రసాద్, ఉపాధ్యాయులు



టెక్కలి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎం.అనురాధ, పి.తమ్మి నాయుడు, కె.వెంకటరావు, రమేష్ తదితరులున్నారు.

టెక్కలి : సమాజంలో పెచ్చుమీరుతున్న ఆన్‌లైన్, సైబర్ నేరాలపైన, మోసాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రోణంకి గౌరీప్రసాద్, పోలాకి వాసుదేవరావు, నరేష్, నారాయణరావు, అల్లంశెట్టి రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజా తదితరులు పాల్గొన్నారు.



కురుస్తున్న వర్షం

చిరుజల్లులు

ప్రజాశక్తి- పాతపట్నం

అల్పపీడన ప్రభావంతో మండలంలో గురువారం తెల్లవారు నుంచి చిన్నచిన్న చిరుజల్లులు పడుతూ సాయంత్రానికి ఒక మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల కొన్ని గ్రామాల్లోని రైతుల పంటల నూర్పులకు ఇబ్బంది కలిగింది. అలాగే కొంత మంది రైతులు నూర్పు చేసిన ధాన్యాలను రైతు భరోసా కేంద్రాలకు, రైస్ మిల్లర్లకు పంపించారు. కొంత మంది రైతులు వర్షానికి వరిచేలను భద్రపర్చుకున్నారు. అయితే మండలంలో సుమారుగా అన్ని గ్రామాల్లో వర్షం కురుస్తోంది.



ఆన్‌లైన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ట్రెజరీ వార్షిక తనిఖీ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఉపఖజానా కార్యాలయంలో ఎటిఒ రామకృష్ణారావు, ఎస్‌టిఒ ఎం.భాగ్యలక్ష్మిలు గురువారం వార్షిక తనిఖీ చేపట్టారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు పంపిన బిల్లులు, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎటువంటి బిల్లులు పెండింగ్‌లో పెట్టవద్దని, నిబంధనల మేరకు కార్యాలయానికి వచ్చిన బిల్లులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిడి సిహెచ్.రవికుమార్, పరిశీలన అధికారులు ఎం.తులసీరావు, టి.సునీత, గోవిందమ్మ, శిరీష, గాంధీ, రాజ్యలక్ష్మి, కళ్యాణి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

రోడ్డు పనులు ప్రారంభం

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రోడ్డ పనులకు వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు పనులు పూర్తయితే యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, టిడిపి నాయకులు లోతుగెడ్డ ఇందిరారామ్, పడాల వెంకటకృష్ణ, లోతుగెడ్డ కృష్ణ, ఎద్దు లక్ష్మణరావు, రైతులు ఎ.తిరుపతిరావు, పెద్దకోట వైకుంఠరావు, ఎద్దు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి అవమానం



కిరణ్‌కుమార్

ఇచ్ఛాపురం : బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బిజెపికి అహంకారానికి నిదర్శనమని, భారత రాజ్యాంగానికి అవమామని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పూడి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. దళిత, గిరిజన, బిసి, మైనారిటీ ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతీసినట్లే ఉన్నాయని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ కుట్రలో భాగమేనని అన్నారు. బిజెపి అనుక్షణం రాజ్యాంగంపై దాడి చేస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాతను ప్రతిసారీ హేళన చేయడం సరికాదన్నారు. రాజ్యాంగంపై, జాతీయ జెండాపై బిజెపికి గౌరవం లేదని మరోసారి నిరూపితమైందన్నారు. అంబేద్కర్‌ను అవమానించినందుకు అమిత్ షా తక్షణమే రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపన చెప్పాలన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న రవికుమార్

బాధితులకు సాయం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కోటిపల్లిలో ఇటీవల సంబంధించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను గురువారం వైసిపి ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు నిత్యవసర సరుకులను, దుస్తులను పార్టీ తరపున అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండిలోని తన స్వగృహంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు మండలంలోని కొమరల్తాడకు చెందిన అగ్నికుల క్షత్రియులు గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఆర్థికంగా, విద్యపరంగా వెనుకబడిన అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, చింత మోహనరావు, తామాడ లక్ష్మణరావు, చింత లక్ష్మయ్య, పవన్‌కుమార్, తరుణ్, బొడ్డ ఢిల్లేశ్వరరావు, అంగ సీత, ఊర్వశి, తామాడ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరరావును సన్మానిస్తున్న అగ్నికుల క్షత్రియులు


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

ఆక్రమణలు తొలగిస్తాం

ప్రజాశక్తి- పలాస

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ప్రభుత్వ భూములు, శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురైతే వాటిని తొలగిస్తామని తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మండలంలోని లొద్దభద్ర, కొత్త పారసాంబ, సొగిడియా ప్రాంతాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని జగన్నాథపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 57లో 2, 52లో ఏడు శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురికావడంతో గ్రామస్తులు సమక్షంలో పరిష్కరించారు. ఈ సదస్సులో 48 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో భూ రీ సర్వే డిటి వాయిలపల్లి సునంద, సర్వేయర్ గిరి, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ, ఎస్ఐ

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పొందూరు

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ మీసాల మన్మథరావు, ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డిజి శిక్షణ ముగింపులో భాగంగా గురువారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే దుష్ఫలితాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి పలు మోసాలపై గ్రామస్థాయిలో ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ మిశ్రో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న మాణిక్యపురం గ్రామస్తులు

ఎన్నాళ్లీ నిరీక్షణ?

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారానికి బెంతొరియాలు ఇంకా ఎన్ని రోజులు నిరీక్షించాలని ప్రశ్నిస్తున్నారు. కవిటి మండల కేంద్రంలో బెంతొరియాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 359 రోజులకు చేరుకున్నాయి. అందులో భాగంగా గురువారం దీక్షలో మాణిక్యపురం గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికైనా తమ సమస్యలు గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి సంతోష్ కుమార్ సాహు, బృందావన్ దళాయి, దూదిస్టి సాహు, ప్రహ్లాద్ బిసాయి, దుదిస్టి, సుమన్ బిసాయి, రాజు సాహు, దేవ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కిట్లు పంపిణీ

నందిగాం : మండల రిసోర్స్ కేంద్రంలో మండలంలోని 85 ప్రాథమిక, 14 జిల్లా పరిషత్ ఉన్నత, రెండు గిరిజన ఆశ్రమ, అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలకు మరుగుదొడ్లు శుభ్రపరిచేందుకు శానిటేషన్ కిట్లను ఎంఇఒ జి.నరసింహులు గురువారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉన్నప్పుడే విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా చేకూరుతుందని అన్నారు.

సక్రమంగా భోజనం అందించాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం సక్రమంగా భోజనం అందించాలని సీతంపేట ఐటిడిఎ ఎపిఒ చినబాబు అన్నారు. గురువారం మండలంలోని వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు సక్రమమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలోని ఆర్ఒ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎపిఒ చినబాబు

ప్లాంట్ పనితీరును పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి డి.బాలరాజు ఆశ్రమ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం


వజ్రపుకొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బెలమాంకు చెందిన అదపాక రాము కుమారుడు దేవి వరప్రసాద్ (10) గుండె ఆపరేషన్‌కు కావాల్సిన నగదును రాముతో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమకూర్చి తమ ఉదారతను చాటుకున్నారు. దూసిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు రాముకు ఆర్థికసాయం అందజేశారు. రాము కుమారుడు సైకిల్ తొక్కుతుండగా ప్రమాదవశాత్తు సైకిల్ హ్యాండిల్ గుండెకు బలంగా తగలడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. రాము కుమారుడికి ఆపరేషన్ చేయించడానికి పేదరికం అడ్డురావడంతో పూర్వ విద్యార్థులు రామకృష్ణ, జితేంద్ర, లక్ష్మీనారాయణ కలిసి రూ.67,500 సేకరించి గురువారం రాము కుటుంబానికి అందజేశారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని చిత్రాడ అశ్వినికి యువతరం సేవా సమితి సభ్యులు రూ.60 వేలు గురువారం ఆర్థికసాయం అందించారు. ఆమెకు ఇటీవల నెలలు నిండని కవల పిల్లలు జన్మించారు. పిల్లల వైద్య ఖర్చులకు దాతలను ఆశ్రయించారు. దీనికి యువతరం సేవా సమితి స్పందించి నిధులు సేకరించి ఆమెకు అందజేశారు. కవలిద్దరూ మృతి చెందారని ఆమెకు సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళి, ఇన్‌ఛార్జిలు బత్తిని విగ్నేష్, కోనేటి దుర్గారావు, సైని లోకనాథం, జ్యోతి, ఆర్.సోమేశ్వరరావు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వైద్యశిబిరానికి స్పందన


ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ఐకాన్ ఆస్పత్రి వద్ద వైద్యులు సీపాన హేమ మోహనరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం ఐకాన్ ఆస్పత్రి, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సంయుక్తంగా రూ.ఐదు వేల విలువైన గుండె ఇసిజి పరీక్షలు, 2డి ఎకో, షుగర్ పరీక్షలు, ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలు (బిఎండి) పరీక్షలను రోగులకు ఉచితంగా నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఐకాన్ ఆస్పత్రి వైద్యులు సీపాన హేమ మోహనరావు, కిమ్స్ వైద్యులు సంయుక్తంగా 259 మంది రోగులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షల్లో ఏడుగురికి గుండె సమస్యలు ఉన్నట్లు గుర్తించి కిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఐకాన్ ఆస్పత్రి సిబ్బంది ఎ. శ్రీనివాస్, కె.శ్రీలత, శివాని, శ్రీలత, మోహిణి, కిమ్స్ ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

29న తూర్పుకాపు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా తూర్పుకాపు సామాజిక తరగతి ఆత్మీయ కలయిక ఈ నెల 29న ఎచ్చెర్ల వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు తెలిపారు. గురువారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో తూర్పుకాపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న తూర్పు కాపులకు రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు అనేక సమస్యలున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఈసమస్యల పరిష్కారానికి వీలుగా ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పక్షాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఐక్యతను చాటుకునేందుకు వీలుగా ఈ సమావేశం ఉంటుందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో తూర్పు సంక్షేమ భవన నిర్మాణంపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి తూర్పుకాపు సామాజిక తరగతికి చెందిన అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.


మాట్లాడుతున్న మోహనరావు

సమావేశంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు డోల జగన్ మోహన్, ఎస్.మోహనరావు, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, కిళ్లారి నారాయణరావు, అంకడాల తవిటన్న, డోల బాలకృష్ణ, ఎం.ప్రభాకర్ , కురిటి దుర్గారావు, ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రెంటికోటలో ప్రభుత్వ కేంద్రాలను తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ వసంతకుమార్, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, మండల పంచాయతీ విస్తీరణాధికారి మెట్ట వైకుంతరావు గురువారం పరిశీలించారు. అంగన్వాడీ, సచివాలయం, పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.


శుభాకాంక్షలు చెబుతున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒ-2కు అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

మండలం ఎంఇఒ-2గా అదనపు బాధ్యతలు చేపట్టిన కె.చిట్టిబాబును మండలం యుటిఎఫ్ శాఖ అభినందనలు తెలిపింది. గురువారం స్థానిక ఎంఆర్‌సి వద్ద చిట్టిబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇటీవల ఉపాధ్యాయురాలిపై జరిగిన దాడి గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళి ప్రకాష్, సిపిఎస్ కన్వీనర్ జి.జానకిరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్, సీతమ్మనాయుడు, త్రినాథ్ నాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఇచ్ఛాపురం : మండలంలోని కొఠారిలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఎయిడ్స్ నియంత్రణపై తహశీల్దార్ ఎన్.వెంకటరావు, జోనల్ సూపర్‌వైజర్ పి.సుధాకరరావు గురువారం అవగాహన కల్పించారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపరాదన్నారు. ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్. డి.ధనలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సహదేవ్‌రెడ్డి, విఆర్ఒ చిరంజీవి, జి.రవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టినరోజును విజయవంతం చేయాలి

పాతపట్నం : మాజీ సిఎం, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు ఈనెల 21న నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో మాట్లాడారు. ఐదు మండలాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పేదలకు, రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి